క్లుప్తంగా

వలంటీర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎచ్చెర్ల ఎంపీడీవో కుమార్‌పట్నాయక్ బుధవారం తెలిపారు. కొయ్యాం, బుడగుట్లపాలెంలో రెండేసి, భగీరథపురం, ఇబ్రహింబాద్, ఎస్ఎంపురం, కేశవరావుపేట, కొంగరాం, పొన్నాడల్లో ఒక్కొక్కటి ఖాళీగా ఉన్నట్టు చెప్పారు. ఈ నెల 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, 14న ఇంటర్వ్యూలు, 15న ఎంపిక జాబితా ప్రకట ఉంటుందన్నారు. అనంతరం నియామక పత్రాలు అందజేస్తామని చెప్పారు.

పాఠశాలల సందర్శన



జి.సిగడాం: మర్రివలస పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న రవి

జి.సిగడాం: మర్రివలస, నాగులవలస, గేదెలపేట, కొత్తపెంట పాఠశాలలను ఎంఈవో అరసాడ రవి బుధవారం సందర్శించారు. విద్యార్థులకు ఆటపాటలతోకూడిన విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతోందన్నారు. ప్రధానోపాధ్యాయులు మజ్జి మదన్‌మోహన్, కాయల రమేష్, బొడ్డేపల్లి రమణమూర్తి, సూజాత ఉన్నారు.

అయ్యప్పస్వామికి అభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాతశ్రీకాకుళం ధర్మశాస్తా ఆలయంలో వేంచేసిన అయ్యప్పస్వామికి బుధవారం క్షీరాభిషేకాలు జరిగాయి. అర్చకుల ఆధ్వర్యంలో స్వామికి పాలతో అభిషేకించారు. అనంతరం స్వామిని అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పూజలందుకున్న స్వామివారు

ఏడబ్ల్యూహెచ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో ఖాళీగా ఉన్న ఏడబ్ల్యూహెచ్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో కుమార్‌పట్నాయక్ బుధవారం తెలిపారు. పీకే నాయుడుపేట, దోమాం, చిలకపాలెం, ఎస్ఎంపురంలో ఖాళీలు ఉన్నట్లు చెప్పారు. ఈ నెల 16వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పొందూరు ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని, ఇంటర్వ్యూల తేదీలను వ్యక్తిగతంగా తెలియజేస్తామన్నారు.

మృతురాలు కుటుంబానికి సాయం



సాయం అందజేస్తున్న దృశ్యం

లావేరు: చినకొత్తకోట గ్రామానికి చెందిన కిల్లంశెట్టి సావిత్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో అదే గ్రామానికి చెందిన అబ్దుల్‌కలాం యూత్ సభ్యులు ఆమె కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. నిరుపేద కుటుంబం కావడంతో 7,500 రుపాయల నగదు, 25 కిలోల బియ్యాన్ని కొత్తకోట పంచాయతీ సర్పంచ్ శాంతాటి భాస్కరరావు ద్వారా అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు మేడబోయిన శ్రీనివాసరావు, వలంటీరు సుంకర రాహుల్, బొబ్బాది ఈశ్వరరావు, ఆకుల బాలక్రిష్ణ, ఎం.మలేశ్వరి, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

గార: బూరవెల్లి గ్రామంలోని షిర్డీ సాయి ఆలయ ఆరో వార్షికోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకం, పుష్పాలంకరణ జరిపారు. మధ్యాహ్నం రెండు వేల మందికి అన్నదానం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పుష్పాలంకరణలో స్వామివారు

అంబేడ్కర్ జయంతిని విజయవంతం చేయండి

రణస్థలం: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని ఈ నెల 14న రణస్థలం మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్టు ఏపీ దళిత మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి దేబారికి రాము తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జనం చెంతకే సంక్షేమం

● యువనేత రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పేదోడి ఇంట ప్రత్యక్ష దైవంలా రాష్ట్రంలో పాలన సాగిస్తూ పేదల గుండెల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిర స్థానం సంపాదించుకున్నారని వైఎస్సార్‌సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. కులమతాలకు అతీతంగా.. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను చేరువ చేస్తున్నట్టు చెప్పారు. శ్రీకాకుళంలోని 16, 27 వార్డుల పరిధిలోని ఇప్పిలి వీధి, చెప్పలవీధుల్లో 'జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సాధు వైకుంఠరావు, కోణార్క్ శ్రీను, మహ్మద్ రఫీ, లావేటి శ్యామ్, రవిశంకర్, కె.వి.మాస్టర్ పాల్గొన్నారు. అలాగే 26వ డివిజన్ కాకివీధి, ఆడంగివారి వీధిలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. డివిజన్ ఇన్‌చార్జీ బాష, దివా, సాగర్, సంగీత పాల్గొన్నారు.



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): 26వ డివిజన్ కార్యక్రమంలో ఎం.వి.పద్మావతి

లావేరు: తామాడ గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు..మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం జరిగింది. మాజీ సర్పంచ్ పాలిశెట్టి మధుబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రఘుమండల క్రిష్ణ, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేసిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు గురించి తెలియజేశారు. జగనన్న స్టిక్కర్లను ఇళ్లకు అంటించారు. నాయకులు కొమ్ము సాయి, మారం అప్పన్న, మల్లిబాబు, కొమ్ము సింహాద్రినాయుడు, నడుపూరి రాంబాబు, గొల్లబాబు, విజయలక్ష్మి పాల్గొన్నారు.



లావేరు: సంక్షేమాన్ని వివరిస్తున్న నాయకులు, గృహసారథులు



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కార్యక్రమంలో రామ్‌మనోహర్‌నాయుడు తదితరులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేటలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించి, స్టిక్కర్లు అతికించారు. ఎంపీపీ మొదలవలస చిరంజీవి, నాయకులు సత్తారు గోపీ, పైడి రంగనాథం, మొదలవలస కృష్ణారావు, పైడి వాసుదేవరావు పాల్గొన్నారు.

రణస్థలం:మండలంలోని పలు పంచాయతీలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జరిగింది. పంచాయతీ సర్పంచులు, గృహసారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: ఇప్పిలి గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం జరిగింది. స్థానిక సర్పంచ్ లోలుగు శ్రీనివాసరావు అధ్యక్షతన గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి యజమానుల అనుమతితో స్టిక్కర్లు అతికించి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జి.సిగడాం: జి.సిగడాం, గొబ్బూరు గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో కలిసి ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, కంది రమాదేవి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. ఇంటి యజమానుల సమక్షంలో గోడపై స్టిక్కర్లను అతికించారు.



ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎంపీపీ చిరంజీవి



రణస్థలం: జె.ఆర్.పురంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నాయకులు



శ్రీకాకుళం రూరల్: స్టిక్కర్లు అందజేస్తున్న దృశ్యం



జి.సిగడాం: ఇంటి గోడపై స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

గాంధీజీ కలలు సాకారం

● ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. గ్రామ సచివాలయాలు, ఆరోగ్య, రైతుభరోసా కేంద్రాల ఏర్పాటే దీనికి నిదర్శనమన్నారు. ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాల అమలు చేయడంతోపాటు అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. మెట్టవలస గ్రామంలో నిర్మించిన హెల్త్ క్లినిక్ , రైతుభరోసా కేంద్రాలను, పాలఖండ్యాంలో సచివాలయాన్ని బుధవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. 75 ఏళ్ల క్రితం గాంధీజీ కలలు కన్న స్వరాజ్యాన్ని ఇప్పుడు చూస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దామన్నారు. వలంటీర్ల వ్యవస్థ, గ్రామ సచివాలయ ఉద్యోగాల నియామకంపై ఇతర రాష్ట్రాల ప్రజలంతా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైపు చూస్తున్నారన్నారు. విద్య, వైద్యం, తాగు, సాగునీటి వనరులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు చెప్పారు. ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేశారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం ప్రజలకు చేరేలా అధికారులు, కార్యకర్తలు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, మండల వ్యవసాయ శాఖసలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, మండల బూత్ కన్వీనర్ అబోతుల జగన్నాథం, వైఎస్సార్‌సీపీ నాయకులు బూరాడ వెంకటరమణ, డకర కృష్ణ, సన్యాసినాయుడు, రామకృష్ణ, డకర సురేష్‌కుమార్, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, సర్పంచులు దారబోయిన రెయిమ్మ, భూపతి సురేష్, బొల్లా జనార్దనరావు, వడిశ మహేశ్వరరావు, సత్యనారాయణ, పిల్లల శివకూమార్, నల్లి తవిటినాయుడు, ఇజ్జి గోవిందరావు, వాన వెంకటరమణ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



జి.సిగడాం: హెల్త్ క్లినిక్, ఆర్‌బీకేల శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ తదితరులు

పాఠశాల సందర్శన

జి.సిగడాం: మెట్టవలస యూపీ పాఠశాలను ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సందర్శించారు. బుధవారం ఉదయం 7.45 గంటలకు పాఠశాలకు చేరుకుని విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. జగనన్న గోరుముద్ద అమలు, ఉపాధ్యాయుల పని తీరుని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ మీసాల సత్యవతి, ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావు, ఏవో వై.శారద, డీఈఈ సీతంనాయుడు, ఏఈఈలు తిరుపతిరావు, భాగ్యలక్ష్మి, ఎం.రమేష్, ప్రధానోపాధ్యాయుడు ఉన్నారు.

బీసీ కులగణన కమిటీ ఏర్పాటుపై హర్షం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బీసీ కులగణనపై అధ్యయన కమిటీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడంపై జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్ట చంద్రపతిరావు, సంఘ గౌరవాధ్యక్షులు డి.పి దేవ్‌లు హర్షం వ్యక్తం చేశారు. శ్రీకాకుళంలోని ఓ ప్రవేటు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీసీల పట్ల సీఎం జగన్‌కు ఉన్న అభిమానాన్ని మరోసారి చాటుకున్నారన్నారు. గత 20 ఏళ్లుగా పోరాటాలు చేస్తూ దేశ వ్యాప్తంగా చేపట్టే జనాభా లెక్కల సేకరణలో బీసీ కులం కాలం చేర్చి కుల గణన చేపట్టాలంటూ కేంద్రాన్ని కోరుతూ వచ్చామన్నారు. కేంద్రానికి ఆ ఆలోచన లేనందున రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కులగణన చేపట్టాలని నిర్ణయించడం బీసీలందరికీ గర్వకారణమన్నారు. దీంతో సామాజిక వర్గాల వారీగా సమన్యాయం జరుగుతోందన్నారు. సామాజిక పరంగా అత్యంత ఎక్కువ స్థానంలో ఉన్న బీసీ కులాల వారు ఇప్పటికీ గుర్తింపునకు నోచుకోని కులాల వారికి తాజాగా న్యాయం జరుగుతోందన్నారు. అలాగే బీసీ జనగణన చేపట్టాలని తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వం వారు పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని, జీవో విడుదల చేయాలని సంఘ జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, బీసీ సంక్షేమ సంఘ నాయకుడు కేశన శంకరరావు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగలరావుకి కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో బాడాన దేవభూషన్, గెంజి తాతారావు, మెండ రాంబాబు, కర్రి రంగాజిదేవ్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రపతి, డి.పి.దేవ్

వైద్యవిద్యలో వెంకటేష్ ప్రతిభ

కొత్తవలస: మండలంలోని రామలింగాపురం గ్రామానికి చెందిన పోతల వెంకటేష్ మెడిసిన్ న్యూరో రేడియాలజీ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించారు. ఆయన తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని శ్రీరామచంద్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ సంస్థలో మెడిసిన్‌లో పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. న్యూరోరేడియాలజీ విభాగంలో చూపిన ప్రతిభకు డాక్టర్ రాబర్ట్సుక్రో గోల్డ్‌మెడల్‌ను రామచంద్ర యూనివర్సిటీ డీన్ ఆర్.వి.వికాంతచలం బుధవారం ప్రదానం చేశారు. విద్యార్థి వెంకటేష్‌ను రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడు బాబు, కొత్తవలస జెడ్పీటీసీ సభ్యురాలు నెక్కలి శ్రీదేవి అభినందించారు. ఆయన ప్రస్తుతం శ్రీకాకుళంలోని జెమ్స్ వైద్య కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.



యూనివర్సిటీ డీన్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న వెంకటేష్

బహుజన నాయకుడికి సత్కారం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): దళిత బహుజన రాజ్యాంగపరమైన హక్కుల పరిరక్షణ కోసం విశేష కృషి చేసిన వ్యక్తి డాక్టర్ కంఠ వేణు అని సీనియర్ దళిత నాయకుడు బొడ్డేపల్లి నర్సింహులు అన్నారు. స్థానిక అంబేడ్కర్ విజ్ఞాన మందిర్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఇటీవల డాక్టరేట్ పొందిన వేణును దళిత బహుజన సంఘాలు సత్కరించాయి. కార్యక్రమంలో డాక్టర్ పొట్నూరు సూర్యం, పిట్ట చంద్రపతిరావు, తైక్వాండో శ్రీను, లఖినేని శ్రీనివాసరావు, ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, మెట్ట మల్లేశ్వరరావు, కల్లేపల్లి రాంగోపాల్, బడియా కామరాజు, రాయి వేణుగోపాల్, ఆతవ ఉదయ్ భాస్కర్, యజ్జల గురుమూర్తి, వైశ్యరాజు మోహన్, అందవరపు లక్ష్మణరావు, దొండపాటి నవీన్, బోసు మన్మథరావు పాల్గొన్నారు.



వేణుని సన్మానిస్తున్న దృశ్యం

'ఆ కాలేజీల గుర్తింపు రద్దు చేయాలి'

శ్రీకాకుళం: జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు అదనపు తరగతుల పేరుతో వేసవి సెలవుల్లో క్లాసులు నిర్వహిస్తున్నాయని, అటువంటి కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని ఏపీ స్కూల్స్, కాలేజీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంగు మన్మధరావు అన్నారు. బుధవారం ఆయన విలేకర్లుతో మాట్లాడుతూ ఆర్ఐవో పర్యవేక్షణ లోపం వల్లే అదనపు తరగతులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలు పక్కాగా అమలు చేయాలన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



రోగిని పరీక్షిస్తున్న దృశ్యం

జి.సిగడాం: వేసవి నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని స్థానిక వైద్యాధికారిణి పొన్నాడ హరితశ్రీ అన్నారు. నాగులవలస, మెట్టవలస, మర్రివలస, గ్రామాల్లో బుధవారం వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. రోగులను పరీక్షించి మందులు అందజేశారు.

లోక్ అదాలత్ చైర్మన్‌ను కలిసిన బార్ అధ్యక్షుడు



సువర్ణరాజుతో సూర్యారావు తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: శాశ్వత లోక్ ఆదాలత్ చైర్మన్ జి.సువర్ణరాజుని ఆయన చాంబర్‌లో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన వెంట బీసీ న్యాయవాదులు సంఘం ప్రతినిధులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్షణరావు ఉన్నారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడుని కూడా కలిశారు.

1 నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు



మాట్లాడుతున్న డీఎస్ఏ సీఈఓ ప్రసాదరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: మే ఒకటి నుంచి జిల్లాలో మొదలుకానున్న వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను విజయవంతం చేయాలని డీఎస్ఏ సీఈఓ బి.వి. ప్రసాదరావు కోరారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, విజయవాడ ఆదేశాల మేరకు జిల్లా క్రీడా ప్రాధికారిత సంస్థ ఆధ్వర్యంలో 2023- 24 సంవత్సరానికిగాను జిల్లా నలుమూలలా ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణ నిమిత్తం బుధవారం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, పీఈటీ సంఘం, క్రీడాసంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. శ్రీకాకుళం కోడి రామ్మూర్తి స్టేడియంలో నిర్వహించిన ఈ సమావేశంలో శిక్షణా శిబిరాల నిర్వహణ, క్రీడాకారుల హాజరు, వసతులు, సౌకర్యాల కల్పన, క్రీడాపరికరాల అందజేత తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ముఖ్య సలహాదారు పి.సుందరరావు మాస్టారు, పీడీ-పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు మొజ్జాడ వెంకట రమణ, యాళ్ల పోలినాయుడు, సాధు శ్రీనివాసరావు, కొమర భాస్కరరావు, జి.అర్జున్‌రావురెడ్డి, రెడ్డి శివకుమార్, కె.మధు, జిల్లా క్రీడా ప్రాధికారి సంస్థ కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ మిషన్ వాత్సల్య వర్తించాలి

ఎచ్చెర్ల క్యాంపస్: అర్హులందరికీ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాత్సల్య పథకాన్ని వర్తింపజేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.యశోద అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శుల (మహిళా పోలీసులు)తో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రాణాంతక వ్యాధిగ్రస్తులు, తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు కేంద్ర ప్రభుత్వం నెలకు రూ. 4 వేలు అందజేస్తోందన్నారు. అర్హులను అంగన్‌వాడీ కార్యకర్తలు, వీఆర్వోలు, మహిళా పోలీసులు గుర్తించాలన్నారు. మరణ ధ్రువీకరణ పత్రం వంటివి లేకపోతే వీఆర్వోలు ధ్రువీకరణతో సైతం పథకం వర్తించనున్నట్లు చెప్పారు. ఈ నెల 15వ తేదీలోగా అర్హులైన వారితో దరఖాస్తులు చేయించాలన్నారు. సమావేశంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అరుణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యశోద

శ్రీకాకుళం తహసీల్దార్‌కు పరామర్శ



వెంకటరావును పరామర్శిస్తున్న అధికారులు

లావేరు: శ్రీకాకుళం తహసీల్దార్ నిడిగంట్ల వెంకటరావు తల్లి దుర్గమ్మ, భార్య పద్మజ ఈనెల 11వతేదీన మరణించారు. విషయం తెలియడంతో పలువురు అధికారులు, నాయకులు బుధవారం లావేరు వచ్చి వెంకటరావును పరామర్శించారు. జిల్లా పరిషత్ సీఈవో ఆర్.వెంకట్రామన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, రణస్థలం జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, గురజాడ విద్యాసంస్థల చైర్మన్ జి.స్వామినాయుడు, బూత్ కమిటీ మండల మాజీ కన్వీనర్ లుకలాపు అప్పలనాయుడు, జెడ్పీ మాజీ చైర్మన్ వైవీ సూర్యనారాయణ, శ్రీకాకుళం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అంబటి శ్రీను, శ్రీకాకుళం ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, డీఎస్పీ భార్గవనాయుడు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చిట్టి జనార్దన్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు క్రిష్ణ తదితరులు వెంకటరావును అతని కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

● 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం:

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లులాంటివని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. గొబ్బూరు, మెట్టవలస సెంటర్, మెట్టవలస గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయాలని పలువురు ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను వర్తింపజేస్తున్నారన్నారు. ప్రజలంతా సీఎం జగన్‌కు అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, వ్యవసాయశాఖ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, బూత్ కన్వీనర్ అబోతుల జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

విద్యాదీవెనతో ఎంటెక్ చదువుతున్నాడు



జగనన్న అమలు చేస్తున్న విద్యాదీవెన పథకం నిధులతో మా బాబు ఎంటెక్ చదువుతున్నాడు. విద్యాదీవెన కింద రూ. 2.23 లక్షలు, వసతి దీవెన కింద రూ. 30 వేలు, అసరా రూ.35 వేలు, జగన్న చేదోడు రూ. 20 వేలు, వైఎస్సార్ చేయూత, 37 వేలు, సున్నా వడ్డీ రూ. 12 వేలు మా కుటుంబానికి అందాయి. జగనన్నకు రుణపడి ఉంటాం.

– యడ్ల దమయంతి, మెట్టవలస

ప్రతిభకు ప్రశంసలు



ఎస్పీ రాధిక చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న డీఎస్పీ జి.శ్రీనివాసరావు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో పలు కేసుల ఛేదనలో ప్రతిభ కనబర్చిన పోలీసులకు ఎస్పీ జి.ఆర్.రాధిక ప్రశంసాపత్రాలను జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం అందజేశారు. రిపబ్లిక్ డే పురస్కారాల నాడు డీఎస్పీ జి.శ్రీనివాసరావు అందుబాటులో లేని కారణంగా.. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందుకోవాల్సిన ప్రశంసాపత్రాన్ని ఎస్పీ ఆయనకు అందజేశారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ, మిస్సింగ్ కేసుల ఛేదన, సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రతిభ కనబర్చిన శ్రీకాకుళం రెండో పట్టణ సీఐ పప్పల శ్రీనివాసరావు, ఒకటో పట్టణ, ఎచ్చెర్ల, పాతపట్నం, హిరమండలం, కోటబొమ్మాళి, బారువ, టెక్కలి, నరసన్నపేట, నందిగాం ఎస్ఐలు బలివాడ గణేష్, సత్యనారాయణ, కామేశ్వరరావు, నారాయణస్వామి, మహ్మద్ ఆలీ, బి.సత్యనారాయణ, ఎల్.రామకృష్ణ, వై.సింహాచలం, అమీద్ అహ్మద్ ఆలీలకు ఎస్పీ రాధిక ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

ఖైదీలకు ఉచిత న్యాయసహాయం

గార: ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందజేస్తామని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. అంపోలు సమీపంలోని జిల్లా జైలును బుధవారం సందర్శించారు. ఖైదీల వసతులు, గ్రంథాలయం, భోజన సదుపాయాలపై ఆరా తీశారు. ఎవ్వరికైనా న్యాయవాది అవసరమైతే నియమిస్తామని, కేసు నడిపిస్తామన్నారు. జైలు సూపరింటెండంట్ నబీఖాన్, జైలర్ దివాకర్‌నాయుడు ఉన్నారు.



ఖైదీలతో మాట్లాడుతున్న సన్యాసినాయుడు